బస్తీ దవాఖానాల్లో సౌకర్యాలు కల్పించాలి

- కనీస మందులు కూడా అందుబాటులో లేవు
- ప్రభుత్వ తీరు మారకుంటే ప్రజల పక్షాన నిలదీస్తాం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


వైద్య సేవల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: పేద ప్రజల ఆరోగ్యాలు బాగుండాలనే ఉద్దేశంతోనే రాష్ట్రంలో బస్తీ దవాఖానాలను మాజీ సీఎం కేసీఆర్ ఏర్పాటు చేస్తే, ఈ ప్రభుత్వంలో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం మూసాపేట్, అల్లాపూర్ డివిజన్‌లలోని బస్తీ దవాఖానాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి దవాఖానాలో అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. నెలవారీగా ఆసుపత్రికి వస్తున్న వారి సంఖ్యను వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాలకుల అలసత్వంతో బస్తీ దవాఖానాలు సుస్తి పడే విధంగా ఉన్నాయన్నారు. దవాఖానాలో కనీసం బీపీ, షుగర్ మందులు కూడా లేవని, టెస్టులు చేయడానికి పరికరాలు లేకుండా దయనీయమైన పరిస్థితులలో దవాఖానాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సంవత్సరం వేడుకలను జరుపుకుంటున్నదని, ఏం సాధించారని వేడుకలని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సంవత్సరంలో బస్తీ దవాఖానాలకు వచ్చే వారి సంఖ్య తగ్గిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా


కేపీహెచ్‌బీ డివిజన్ బస్తీ దవాఖానాలో వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

అధికారులు, ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకొని ప్రజల కోసం పని చేసే విధంగా ఉండాలని, లేకుంటే బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం, మాజీ కార్పొరేటర్ బాబూరావు, గౌసుద్దీన్, అంబటి శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రభాకర్ గౌడ్, జిల్లా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలను పరిశీలించిన కార్పొరేటర్‌లు

కూకట్‌పల్లి(జోన్ బృందం): కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో పలు దవాఖానాలను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కార్పొరేటర్‌లు, బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఆసుపత్రుల్లో సౌకర్యాలు, మందుల నిల్వలు, టెస్టులు చేసే పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో బస్తీ దవాఖానాల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, నేడు సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యవసరమైన ఇంజక్షన్లు, మందులు కూడా అందుబాటులో లేవన్నారు. అధికారులు వెంటనే స్పందించి అన్ని దవాఖానాల్లో వసతులు, మందులు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు.


వివేక్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మందులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శిరీష


ఫిరోజ్‌గూడలోని దవాఖానాలో.. కార్పొరేటర్ రవీందర్ రెడ్డి తదితరులు


జింకలవాడ దవాఖానాలో వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సతీష్ గౌడ్


వివేకానందనగర్ డివిజన్‌లోని దవాఖానాలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి..


ఎల్లమ్మబండలోని బస్తీ దవాఖానాలో..


మందుల కొరతపై వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ


ట్రై సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు వెంకటేష్ గౌడ్, శ్రీనివాసరావు, రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ హిల్స్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులకు ఉచిత ట్రైసైకిళ్లు, సహాయ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులను సమాజంలో ఎటువంటి వివక్ష లేకుండా చూడాలన్నారు. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ, అలీం కో ఇండియా సంస్థ సమన్వయంతో నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులకు ఉచిత ట్రైసైకిళ్లు, సహాయ పరికరాలను అందజేశారని తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగుల కోసం ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. దివ్యాంగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో రూ.6 వేల ఆసరా పెన్షన్ అందజేస్తారని తెలిపారు. అదేవిధంగా దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నే శ్రీనివాసరావు, మాధవరం రోజాదేవి, దివ్యాంగులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి సన్మానం

ఆల్విన్‌కాలనీ: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మారెళ్ల శ్రీనివాసరావు, మహిళా విభాగం డివిజన్ అధ్యక్షురాలు ఉయ్యూరు శ్రీదేవి పీజేఆర్ నగర్‌లో రాములుని సన్మానించి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో రాజేష్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలతో కాంగ్రెస్ మభ్యపెట్టింది


ర్యాలీలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు


బైక్ ర్యాలీలో పాల్గొన్న రవికుమార్ యాదవ్, నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో 6 గ్యారంటీలను, 66 వాగ్దానాలను ప్రకటించి 100 రోజుల్లోనే నెరవేరుస్తామని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ బాలానగర్ నగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్ 2, ధనలక్ష్మి సెంటర్ నుంచి 6వ ఫేజ్‌లోని ఫోరంమాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంకుశ పాలనకు స్వస్తి చెప్పి ప్రజాస్వామిక పాలనను అందిస్తామన్న కాంగ్రెస్ పార్టీ మాట తప్పిందని విమర్శించారు. మారింది పాలకులే తప్పా పాలన కాదని ఎద్దేవా చేశారు. అదేవిధంగా హిందూ దేవాలయాలకు కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. సొంత ఇంటి కల కలగానే మిగిలి పోయిందని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పాదయాత్ర ప్రముఖ్ అర్సనపల్లి సూర్యరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాష్‌రావు హాజరయ్యారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, నాయకులు ప్రీతంరెడ్డి, శ్రీధర్, కంచి మహేందర్ యాదవ్, కుమార స్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏ హామీ నెరవేర్చలేదు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఎల్లమబండలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కడానికి అనేక హామీలు ఇచ్చి, నేడు విస్మరిస్తుందన్నారు. ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రభుత్వం విజయోత్సవ కార్యక్రమాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, కో కన్వీనర్ మణిభూషణ్, సీనియర్ నాయకులు రామరాజు, నరేందర్, నర్సింగ్ యాదవ్, కేశవ్, నరసింహాచారి, అరుణ్‌కుమార్, కుమార్ యాదవ్, వేణుగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలి


కార్యక్రమంలో బ్రహ్మర్షి మోహనాచార్యులను సన్మానిస్తున్న విశ్వకర్మలు

ఆల్విన్‌కాలనీ: విశ్వకర్మలు ఐకమత్యంగా పోరాడి మనకు దక్కాల్సిన హక్కులను సాధించుకోవాలని వేద పండితులు, బ్రహ్మర్షి మోహనాచార్యులు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి విశ్వకర్మ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి, జగద్గిరిగుట్టలో శ్రీమద్విరాజ్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కవి, గాయకుడు దరువు అంజన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వకర్మ లేనిదే విశ్వంబు లేదన్నారు. విశ్వకర్మ నాటి ద్వారకా నిర్మాణం నుంచి ప్రతి నిర్మాణంలోనూ విశ్వకర్మనే మూలకర్త అని, అలాంటి విశ్వకర్మలకు సామాజికంగా, రాజకీయంగా ప్రతి అంశంలోనూ అన్యాయం జరుగుతూ వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతచారి, అధ్యక్షులు శ్రీరాముల శ్రీనివాస చారి, ప్రధాన కార్యదర్శి మనోహర్ చారి, తిరుపతి చారి, భిక్షపతి చారి, శ్రీశైలం చారి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార భాగస్వాముల డ్రైవర్లే సూత్రధారులు


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కే సురేశ్‌కుమార్

- కూకట్‌పల్లి చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- రూ.50 లక్షల సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్

జీడిమెట్ల: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనాన్ని కూకట్‌పల్లి పోలీసులు ఛేదించారు. డ్రైవర్లే సూత్రధారులుగా గుర్తించి ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ కే సురేశ్‌కుమార్, క్రైం డీసీపీ నరసింహ, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీసీఎస్ ఏసీపీ కళింగరావు, కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ముత్తుతో కలిసి మంగళవారం వివరాలు వెల్లడించారు. కూకట్‌పల్లిలోని జయనగర్‌కు చెందిన కూమని మధుసూదన్‌రావు గత నెల 28న ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి మియాపూర్‌లో ఉండే పెద్ద కుమార్తె ఇంటికి వెళ్లారు. తర్వాత రోజు ఉదయం వారుండే అపార్టుమెంట్ వాచ్‌మెన్ మధుసూదన్‌రావుకు ఫోన్ చేసి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని సమాచారం అందించాడు. వెంటనే ఇంటికి చేరుకున్న మధుసూదన్‌రావు బీరువా తెరిచి చూడగా 80 తులాల నగలుతో పాటు 157 గ్రాముల వెండి, రూ.2 లక్షలు కనిపించలేదు. దీంతో మధుసూదన్‌రావు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

◆ సుమారు 200 సీసీ కెమెరాల ఫుటేజీలను 2 రోజుల పాటు తీవ్రంగా పరిశీలించగా దొంగతనానికి పాల్పడింది మధుసూదన్‌రావు వ్యాపార భాగస్వాముల డ్రైవర్లేనని పోలీసులు ఆధారాలు సేకరించారు. అనంతరం వివేకానందనగర్‌లో ఉండే డ్రైవర్లు సంపంగి లక్ష్మణ్ (44), కూకట్‌పల్లికి చెందిన గుమ్మడి నాగశంకర్ (23) అదే ప్రాంతానికి చెందిన గుమ్మడి శంకర్(23) దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాకు చెందినవారే. వీరి నుంచి పోలీసులు 80 తులాల బంగారు నగలు, వెండి సామగ్రి, రూ.2 లక్షలను స్వాధీనం చేసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన కూకట్‌పల్లి డీఐ బీ వెంకటేశం, ఎస్ఐలు సతీశ్‌రెడ్డి, సీహెచ్.రాజు, పోచయ్య, గిరీశ్‌ను డీసీపీ అభినందించారు.

అమరుడు శ్రీకాంతాచారికి ఘన నివాళి


పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్ తదితరులు


ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరుడైన కాసోజు శ్రీకాంతాచారి తెలంగాణ ప్రజలందరి గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ కార్యాలయంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, మేకల హరినాథ్, మక్కాల నర్సింగ్‌రావు, కర్రె జంగయ్య, సయ్యద్ ఏజాజ్, శ్రీనివాస్‌రెడ్డి, మట్టి శ్రీను, గడ్డం నర్సింగ్‌రావు, మక్కాల సత్యనారాయణ, బుర్రి యాదగిరి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనపై కళాయాత్ర


పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కూకట్‌పల్లి: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు 2 బృందాలుగా ఏర్పడి ప్రజా పాలనపై కళాయాత్రను మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా కూకట్‌పల్లి మండలం శంషీగూడ, మూసాపేట్, అల్లాపూర్ జీహెచ్‌ఎంసీ పరిసర ప్రాంతాల్లో ప్రజా పాలన కళాయాత్ర నిర్వహించారు. కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో, డప్పు చప్పుళ్లతో ప్రచారం చేశారు.

టిప్పర్ ఢీకొని వాచ్‌మెన్ మృతి


మృతుడు రమేష్ (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ: టిప్పర్ ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ కంపెనీ వాచ్‌మెన్ మృతి చెందాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజుల రామారం ప్రాంతంలో నివాసం ఉండే సలేగా రమేష్ (43) గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం తన ద్విచక్ర వాహనంపై నైట్ డ్యూటీకి వెళ్లి విధులు ముగించుకుని మంగళవారం తెల్లవారుజామున ఇంటికి వెళ్తున్నాడు. కేపీహెచ్‌బీకాలనీ ఆల్మండ్ స్వీట్ హౌస్ వద్ద గల యూటర్న్ వద్ద అకస్మాత్తుగా టిప్పర్ మూలమలుపు తిరిగి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. రమేష్ టిప్పర్ వెనుక చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐటీయూసీ ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ ఏఐటీయూసీ ఆటో యూనియన్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో జరిగిన ఆటో యూనియన్ నేతల సమావేశంలో కమిటీ గౌరవ అధ్యక్షుడిగా గురు రాఘవేంద్ర, కన్‌స్ట్రక్షన్ చైర్మన్‌గా అంకాల శ్రీరాములు, అధ్యక్షుడిగా గజ్జల వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా మర్రి నోమేష్, కోశాధికారిగా జి.కృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బట్టు సుబ్బరాజు, ఉపాధ్యక్షులుగా ఎస్.మారుతి, ఎస్. ప్రవీణ్, టి.బాలు, పి.యుగేందర్, డి.రామారావు, చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా కొప్పుల సర్వేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రవిగౌడ్, ఓ.శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా వై.కాసులు, టీ.మల్లి, ఎం.నాగరాజు, శంకర్ నాయక్, వీరబాబు, గోపాల్, సత్యనారాయణ, ఎం. నర్సింహులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు, వారి కుటుంబాలకు ఆరోగ్య భద్రత, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

రూ.4 వేల పించన్ అందించిన ఘనత కేసీఆర్‌దే..


దివ్యాంగుడికి సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్‌లు

కేపీహెచ్‌బీకాలనీ: దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 200 పింఛన్‌ను రూ.4 వేలు చేసి అందించిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీకాలనీ డివిజన్‌లో దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సైకిళ్లు, చేయూత పరికరాలు, వడ్డీలేని రూ.10 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ వారు అందించే త్రీ వీలర్ సైకిళ్లు దివ్యాంగులకు ఇబ్బందిగా ఉంటాయని, అధికారులు మోటార్ వాహనాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, శిరీష, మహేందర్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

చలో ఇందిరాపార్కుకు తరలిన నాయీ బ్రాహ్మణులు



మోతీనగర్: నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన చలో ఇందిరా పార్కు ధర్నాకు మోతీనగర్ నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ముందుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం మోతీనగర్ అధ్యక్షులు టి. వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సిరిసిల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాజకీయ పదవులలో వాటా కేటాయించాలని కోరారు. ఇతర కులాల వారు బార్బర్ షాపులు నిర్వహించకుండా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.గణేష్, నవీన్, ఎం.రాజు, కనకయ్య, ఎస్ వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో జట్ల ఎంపిక


ఎంపికైన మెన్ అండ్ ఉమెన్ జట్టు, సౌత్ జోన్ హాకీ పురుషుల జట్టు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ఆల్ ఇండియా రెజ్లింగ్ మెన్ అండ్ ఉమెన్ జట్లను, సౌత్ జోన్ హాకీ పురుషుల జట్టును మంగళవారం ఎంపిక చేశారు. సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో ఎంపిక జరిగింది. హాకీ జట్టు చీఫ్ సెలెక్టర్, ఇండియన్ టీం మాజీ కోచ్ పెరుమాల్ మధుకరన్ పర్యవేక్షణలో జట్లను ఎంపిక చేశారు. జనవరి 5 నుంచి 8 వరకు గురుకాశీ యూనివర్సిటీ, పంజాబ్‌లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీలో రెజ్లింగ్ జట్టు పాల్గొననుందన్నారు. అదే విధంగా జనవరి 14 నుంచి 18 వరకు జరిగే యూనివర్సిటీ మెన్ ఛాంపియన్‌షిప్‌లో రెజ్లింగ్ మెన్ జట్టు పాల్గొననుందని తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో జరిగే సౌత్ జోన్ హాకీ మెన్ ఛాంపియన్‌షిప్‌లో జేఎన్‌టీయూ జట్టు పాల్గొననున్నట్లు ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్ తెలిపారు.

నేడు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ: ఆర్యవైశ్య పితామహుడు, మాజీ సీఎం, దివంగత కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం సీల్ వెల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ల శిక్షణా కేంద్రాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ బండారు సుబ్బారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో బుధవారం కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. ఇందులో ప్రధానోపాధ్యాయురాలిగా బిందుశ్రీ, విద్యాశాఖ మంత్రిగా అమృతవల్లి, ప్రిన్సిపాల్ సెక్రటరీగా సువర్ణ, విద్యాశాఖ కార్యదర్శిగా జీవిత, కలెక్టర్‌గా అంజలి, జిల్లా విద్యాధికారిగా అన్విక్ రావు, మండల విద్యాధికారిగా మహాలక్ష్మి తమ విధులను నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యార్థులు తాము పాఠశాల నిర్వహణలో పొందిన అనుభవాన్ని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి, ఏఎంఓ రవీందర్ రాజు, ఎంఈఓ కిషన్, ఉపాధ్యాయులు శంకరప్ప, దమయంతి, కుసుమ, మల్లారెడ్డి, రామ్మోహన్ రావు, తుల్జారాం, దామోదర్ రెడ్డి, గోపాల కృష్ణ, సత్యనారాయణ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, గాయత్రి, శ్వేత రెడ్డి, శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కారం


పనుల గురించి తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: ప్రాధాన్యత క్రమంలో వివిధ కాలనీల్లోని సమస్యలను పరిష్కరిస్తున్నామని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ హెచ్‌ఎంటీ శాతవాహన, భాగ్యనగర్ కాలనీ ఫేజ్ 1 కాలనీల్లో మురుగు నీటి కాలువ లైన్ నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు.

నిధుల మంజూరుపై హర్షం


పుష్పగుచ్ఛం అందజేస్తున్న చీఫ్ ఇంజనీర్ డాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ పాలేరుకి మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం వంద కోట్ల రూపాయలను మంజూరు చేయటం పట్ల పాలేరు కళాశాల నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి. రవీందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ డాక్టర్ వి. వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి యూనివర్సిటీ రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావులకు మంగళవారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. భవన నిర్మాణం, రీసెర్చ్ సెంటర్, ఇతర మౌలిక వసతులను కల్పించడం కోసం రూ.108.60 కోట్ల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ పెద్దలకు, యూనివర్సిటీ మాజీ వీసీ బుర్రా వెంకటేశంకు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462